# వరద

రామస్వామి తడిబట్టలు మార్చుకుని తువ్వాలుతో తల తుడుచుకుంటూ చటుక్కున ఏదో గుర్తుకొచ్చినట్లు తడీపొడిగా ఉన్న పేంటు జేబులో పెట్టిన, నోట్ల కట్ట తీసి, జాగ్రత్తగా చెక్క బీరువాలో పెట్టి వచ్చి, మళ్ళీ తువ్వాలందుకున్నాడు —

" ఒక ప్రకటన —

కళింగ పట్నానికి మూడువందల యాభై కిలోమీటర్ల దూరంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల రాగల నలభై ఎనిమిది గంటలలో విశాఖపట్నం, ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలలో భారీ వర్షాలు పడవచ్చు. కాకినాడ, మచిలీపట్నం రేవులలో మూడో నెంబరు ప్రమాద సంకేతం ఎగురవేశారు. బెస్తవాళ్ళని సముద్రం మీదకు పోవద్దని హెచ్చరిక.

ప్రకటన విన్నారు. ఆకాశవాణి, విజయవాడకేంద్రం కొన్ని క్షణాలలో అంగ్లంలో వార్తలు ఢిల్లీ కేంద్రం నుంచి — "

బయట వర్షం జోరుగా కురుస్తోంది. చుట్టు పక్కలంతా చీకటి ముసురుకుని ఉంది. పట్టిన ముసురు చూస్తే ఇప్పట్లో వాన వెలిసేట్టు లేదు.

రామస్వామి మళ్ళీ వెళ్ళి చెక్క బీరువా తీసి అందులోంచి నోట్ల కట్ట తీసి జాగ్రత్తగా లెక్క పెట్టాడు. తను ఎంతో జాగ్రత్తగా కోపరేటివ్ సొసైటీ నుండి తెచ్చుకున్న అప్పు. కొత్త నోట్లు లెక్క పెడుతుంటే ఒక అనిర్వచనీయమైన ఆనందం గర్వం కలిగింది. కాని ఏం లాభం?

అదొక క్షణంలో మాయమైంది. అనసూయకి కట్టుడు చీరలు లేవనీ, బొత్తిగా చిరిగిపోయాయని రెండు నెలల నుంచి చెపుతోంది. తన చేతిలోకి యింత డబ్బు వచ్చినా, ఒక్క వందరూపాయలు పెట్టి రెండు చీరలు కొనే అవకాశం లేదు. ప్చ్.... !

అనసూయ టీ గ్లాసుతో వచ్చింది. " ఏమిటీ డబ్బు తెచ్చారా " అంది.

" ఆఁ.... ఉదయమే డ్రాఫ్టు వచ్చింది. బ్యాంకుకెళ్ళి మార్చుకొచ్చాను. "

" మొత్తం ఎంత ? " అంది. ఆమె ఇంచుమించు రహస్యం చెప్తున్నంత నెమ్మదిగా. ఇంట్లో ఎవరూ లేరు. ఇద్దరే అయినా ఎందుకో ఆ రహస్యం.

" మూడువేల తొమ్మిది వందలు " అన్నాడు.

" పోనీలెండి. అనుకున్నట్లు, ఓ వంద రూపాయలు చేర్చి నాలుగు వేలు అల్లుడికిచ్చేద్దాం " అంది ఖాళీ గ్లాసు అందుకుని. విసురుగా గాలి తెర కొట్టింది. కిటికీ రెక్కలు టప టప కొట్టుకుని, ఓ జల్లు యిల్లంతా చిమ్మిపోయింది.

" అబ్బబ్బ ఏం వాన ? ఇది తగ్గేట్టు లేదు సరికదా ! గాలి కూడా పెరుగుతోంది " విసుక్కుంటూ కిటికీ రెక్కలు మూసి గడియ పెట్టడానికి ప్రయత్నిస్తోంది.

" అనసూయా ! నిజానికి నీకో రెండు చీరలు కొందామనుకొన్నాను. నేను, నాలుగు వేలకి పైన రెండు మూడొందలొస్తాయనుకున్నా " అన్నాడు మంచం మీద నడుం వాలుస్తూ.

అనసూయ ఆశ్చర్యంగా భర్తవంక చూస్తూ -

"మంచి మాట చెప్పారు ! నాకిప్పుడు చీరలకేమొచ్చింది. ముందు పిల్ల విషయం చూడండి. మాట ముఖ్యం. మర్యాద ముఖ్యం" అంది అనసూయ. భార్య వైపు చూస్తూ అశక్తతగా నిట్టూర్చాడు రామస్వామి.

పదిహేడో ఏడు నిండగానే కూతురు వాసంతికి పెళ్ళిచేశాడు, రామస్వామి. పెళ్ళి చేశాడూ అంటే అంతులేని ఆర్థిక స్తోమత వుండీ కాదు. మరీ చాదస్త భావాల వల్లనూ కాదు. కానీ లోకం పోకడ చూస్తుంటే గుండె నిబ్బరం వున్నవాడు కూడ బేజరెత్తి పోతున్నారు. అందుకే తన లోపలి మనిషి నోరు నొక్కి కూతురి పెళ్ళి చేశాడు.

"ఇది చూస్తే చురుకుగా చదువుకుంటూ పోతోంది. టెన్త్ బాగా మార్కులతో ప్యాసయిందని ఇంటర్‌లో చేర్చారు. అదీ ఫస్టు క్లాసులో ప్యాసయింది." అంటూ నిట్టూర్చింది, అనసూయమ్మ. నిజంగా అది ఆనందించాల్సిన సమయమో, నిట్టూర్చాల్సిన సమయమో అర్థంకాలేదు.

"ఇంటరు ప్యాసయితే బి. ఏ పెళ్ళికొడుకుని చూడచ్చు. ఇదే బి. ఏ ప్యాసయి కూర్చుంటే మరి ఎం. ఏ వాడ్ని తేవద్దూ" ఇదో పెద్ద ప్రశ్న - భార్య అనసూయ ఆలోచన.

"పైకి పోయిన కొద్దీ డబ్బు గుమ్మరించాలి"

"రామస్వామీ ! ఉద్యోగాలు అవీ అంటూ ఆడపిల్లని ఇంట్లో పెట్టుకోకు. పెళ్ళి ఒక సమస్యయి పోతుంది. ముందు పెళ్ళి చేసెయ్. తర్వాత వాళ్ళకిష్టమైతే వాళ్ళే చేయించుకుంటారు, ఉద్యోగమో సద్యోగమో" ఒక మిత్రుడి ఉచిత సలహా.

"డబ్బు సంపాదన మొదలైతే పిల్లలు మన మాట వింటారటోయ్" ఒక సంకుచితుడి మరో సలహా.

" ఆడపిల్లకి ఆత్మవిశ్వాసం పెరిగితే చాలా కష్టం గురూగరూ " ఆఫీసులో అణా పైసల వడ్డీ లెక్కలుకట్టే గుమాస్తా దూరదృష్టి.

ఇలా ఇలా యింటా బయటా ఎన్నో సలహాలు, మరెన్నో బెదిరింపులు. అంతకన్నా సూటిగా హెచ్చరికలు విన్నమీదట వాసంతి పెళ్ళి ప్రయత్నం మొదలుపెట్టాడు.

పదివేల కట్నంతో అయిదువేల లాంఛనాలతో క్లుప్తంగా జరిపే పెళ్ళి తంతుతో పెళ్ళి నిశ్చయమైంది. రామస్వామి చేస్తున్న ఉద్యోగం నుండి ఎంత రాబట్టగలడో అంతా రాబట్టాడు.

పి. ఎఫ్ లోంచి కూతురి పెళ్ళికోసం కొంత తీసుకున్నాడు. కోపరేటివ్ సొసైటీ నుండి అప్పు చేశాడు. బయట చిట్‌ఫండ్‌లో పాట పాడేశాడు. ఇలా అన్నిచోట్లా తడిమితే అతనికి పదహారువేలు కూడాయి. అయితే పదివేలూ కట్న రూపంలో యిచ్చేస్తే మిగిలిన ఆరువేలలో లాంఛనాలు, పెళ్ళి ఖర్చులూ చాలవు. అందుకే కాబోయే అల్లుడిని, తండ్రిని ఎదురుగా పెట్టుకుని, నాలుగువేలు కట్నంలో బకాయి పెట్టి — అదీ — ఒక్క ఏడాదిలో అంటే వచ్చే అక్టోబరు దసరాలకి తను కోపరేటివ్ సొసైటీ ఇన్‌క్లూజివ్ లోను పెట్టి ఇస్తానని — దానికి సంబంధించిన వివరాలన్నీ వివరించాడు. ఆ తండ్రీ కొడుకులు సరే నన్నారు. కాకుంటే లాంఛనాలు ఆ సమయంలో జరక్కపోతే అందం వుండదని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. దానికి రామస్వామి కొండెక్కినంత సంబరపడ్డాడు. తన కూతురి అదృష్టం వల్ల యింతటి సంస్కారవంతులు దొరికారని మురిసిపోయాడు.

వాసంతికి పెళ్ళయి ఏడాది కావస్తోంది. దసరాకి అల్లుడు కూతురూ వస్తే, ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చి ఇద్దరికీ తగుమాత్రంగా బట్టలు పెట్టి పంపుదామని నిశ్చయించుకున్నాడు. పన్నెండు వాయిదాల జమ పూర్తవగానే సొసైటీ లోను పెట్టి డబ్బు తెప్పించుకున్నాడు. ఈ రోజు ఒక వంద తక్కువగా ఉంది. అదెలాగైనా సర్దుకోవచ్చు.

బయట వర్షం క్షణ క్షణానికీ పెరుగుతూనే ఉంది.

*

రామస్వామి పేపరు చూసి కలవరపడ్డాడు. గోదావరి వరదకి చిన్న చిన్న గ్రామాలన్నీ మునిగి పోవడమే కాదు. చుట్టు పక్కల ఉన్న కాలవలన్నీ పొంగాయి. గట్లు తెగిపోయాయి. ఎప్పుడూ అనుకోని విధంగా భీమవరం, కణుకు, ఉండి, అత్తిలి, నిడదవోలు, తాడేపల్లి గూడెం అయిదారడుగుల నీళ్ళలో తేలియాడుతున్న దృశ్యాలు పేపరునిండా చూస్తే గుండె బేజారెత్తిపోయింది.

" అనసూయా, అనసూయా ! " అంటూ అరిచాడు. అనసూయ " ఏమిటీ " అంటూ పలికింది, వంటింటిలోంచి. మూడునాళ్ళగా ముసురు పట్టి కురిసిన వాన కురిసినట్లుంది. అనసూయ ఇల్లు సర్దుకోవడంతో సతమతమైపోతోంది. గచ్చు నేలయినా చెమ్మగా అయిపోయింది. వర్షం నిలిచి కురవడంవల్ల అక్కడక్కడా ఇల్లు కురుస్తోంది. బేసెన్లు, కంచాలు ఇంట్లో అక్కడక్కడా అమర్చబడ్డాయి. ఇంట్లోంచి బయటికి, బయట నుంచి ఇంట్లోకి తిరగడం వల్ల ఇల్లంతా తడి తడిగా అయిపోతోంది. ఎన్ని గుడ్డలు పెట్టి గదులు తుడిచినా నేల తేమగానే ఉంది.

రామస్వామి పేపరు చేత్తో పట్టుకుని వంటింటి గుమ్మంలోకి తొంగి చూసి " చూడు ఎంత దారుణంగా వుందో " అన్నాడు.

అనసూయ కూరలు తరుగుతూనే లేచి పేపర్లో ఫోటోలు చూసి ఎంతో వాపోయింది.

" అమ్మా త్వరగా వంట పూర్తి చెయ్. అన్నం తిని పోవాలి " అంటూ వాన్నింగిచ్చాడు. పదోక్లాసు చదువుతున్న రమణ.

" ఇంత వానలో స్కూలేమిట్రా అంతా మడుగులై నానిపోయి ఉంటేనూ " అంది అనసూయ.

" నాకదంతా తెలీదు, నేను వెళ్ళాలి. వెళ్ళాక స్కూలు లేదంటే వచ్చేస్తాను. అంతేగాని ముందే స్కూలు మానేయను " అంటున్న రమణ మాటలు ఎవరూ పట్టించుకోలేదు.

" అలివేలూ వాళ్ళు ఎలా ఉన్నారో " అంది అనసూయ. " నిజమే ! రైళ్ళూ బస్సులూ పోవటం లేదు " అన్నాడు సాలోచనగా. వీళ్ళ మాటలు నోట్లో ఉండగానే బయట రిక్షా ఆగింది. అందులోంచి దిగుతున్న అలివేలు, మాధవరావు, పిల్లల వాలకాలు చూసి భార్యాభర్తలు నిర్ఘాంతపోయారు.

జుట్టు చెరిగిపోయి, చీర నలిగిపోయి. మాసిపోయి, విపరీతమైన అలసటగా ఉంది అలివేలు ముఖం. మాధవరావు ప్యాంటు నిండా బురద ఎండిపోయి, వేసుకున్న తెల్ల షర్టు నల్లగా మాసిపోయి ఉంది. ముఖం పెంకు రంగులో వికృతంగా ఉంది. పిల్లలు బిక్కు బిక్కుమంటూ పూర్తిగా నలిగి వాడిపోయినట్లున్నారు.

ముందుగా అనసూయే తేరుకుంది. పరుగులాంటి నడకతో అలివేలుని చేరుకుంది.

" రామ్మా - రా ! ఇప్పుడే అనుకుంటున్నాం ఎలా ఉన్నారో అని " అంది.

ఆ మాటకే అలివేలు కళ్ళలో నీళ్ళు నిండాయి.

"ఎలా ఉండటమేమిటి వదినా ! అంతా అయిపోయింది పూర్తిగా. మా ఇంట్లోకి ఆరడుగుల నీళ్ళు వచ్చాయి. సామానంతా పోయింది. కట్టు బట్టలతో ప్రాణాలతో బయట పడేందుకు నానా అవస్థా అయింది" చివరి మాటలు దుఃఖంతో పూడుకుపోయాయి.

"అయ్యో ! అయ్యో ! రామ్మా రా లోపలికి రా ముందు తర్వాత మాట్లాడుకుందాం" అంటూ ఆడబిడ్డని ఆప్యాయంగా పొదివి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. పిల్లలిద్దరూ తల్లి వెంట లోపలికొచ్చారు. రామస్వామి మాధవరావు మాటల్లో పడ్డారు.

"చాలా సడన్‌గా వచ్చింది బావగారు. రైల్వేకట్ట దిగువన ఇల్లుకదా ! అవతలివైపు కాలవగట్టు ఒక్కసారి తెగింది. అయిదడుగుల ఎత్తున ఒకేసారి ఉప్పెనలా వచ్చేసరికి పెరటి గోడ కూలిపోయింది. నీరంతా ఇంట్లోకి ప్రవేశించింది. అదృష్టమేమంటే నేనూ ఇంట్లోనే ఉన్నాను. లేకపోతే పిల్లలు కూడా దక్కేవారు కాదు" అన్నాడు.

"అంతమాటనకు. ఏదో దేవుడి దయవల్ల మీరు బయట పడ్డారు. అదే పదివేలు" అంటూ ఓదార్చాడు రామస్వామి మాధవరావుని.

అలివేలు రామస్వామికి సొంత చెల్లెలు, తల్లి చనిపోయిన తర్వాత రామస్వామి బాధ్యత స్వీకరించి పెళ్ళిచేసి పంపాడు. మాధవరావు యోగ్యుడు. ఏనాడూ అది పెట్టలేదు ఇది ఇవ్వలేదు అన్న మాట అని ఎరుగడు. అలివేలు కూడా చాలా పెద్ద మనసు కలది. ఎప్పుడైనా క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఒక పూటో ఒక రోజో వచ్చి ఉండటమే గానీ, అన్నగారికి ఎప్పుడూ ఆమె భారంగా ఉండలేదు. రామస్వామి మీద ఆమెకి ఎంతో గౌరవం. కానీ ఈ రోజు అనుకోని విధంగా అన్నగారిల్లు చేరాల్సి వచ్చింది. అయినా అన్న వదిన ఎంతో ఆదరంగా ఆహ్వానించటంతో కొంత ఊరట కలిగింది.

మర్నాడు మాధవరావు బయలుదేరి వెళ్తూ " బావగారూ ! కాస్తో కూస్తో దొరికిన సామాను అటకమీద చేర్చాను. ఉంటుందన్న నమ్మకం లేకపోయినా నేను అక్కడ ఉంటే జరిగేదేమిటో తెలుస్తుంది. గవర్నమెంటు పేర్ల జాబితాలు, సహాయ కార్యక్రమాలు ఎన్నో ఉంటాయి. కనీసం పిల్లల్ని మీ చెల్లెల్ని మీ దగ్గర సురక్షితంగా దింపాను. నాకేం భయం లేదు " అని కాస్సేపాగి " మీకేమైనా ఇబ్బంది " అతని మాట పూర్తి కాకుండానే రామస్వామి కలియబడి " చాల్లేవయ్యా ! మీరెవరు ? పరాయి వాళ్ళా – మరింక మాట్లాడక. నువ్వు వెళ్తే కొంచెమైనా లాభముంటుందంటే వెళ్ళు " అన్నాడు. మాధవరావు వెళ్ళిపోయాడు.

అలివేలు రెండో పిల్లాడు మూసిన కన్ను తెరవలేదు. రామస్వామి హాస్పటల్‌కి తీసుకెళ్ళాడు. ఏవో మందులేశారు. కానీ జ్వరం తగ్గలేదు.

" వీడే ముందు కొట్టుకుపోయాడు. అరగంట వెదికితే గానీ దొరకలేదు. అసలు పోయాడనే అనుకున్నాను " అంది అలివేలు గాద్గదికంగా.

మూడు రోజులైనా పిల్లాడికి జ్వరం తగ్గలేదు. డాక్టరు మందులు మార్చారు. ఇంజక్షన్లు చేశారు. గుండెలో నెమ్ము పేరుకుంది. ఇన్‌ఫెక్షన్ ఉందని ఎక్స్‌రే, టెస్టులు, ఇంజక్షన్లు అన్నీ చకచక జరిగి పోతున్నాయి. అలివేలు అశక్తతగా వూరుకుండిపోయింది. ఆమె మనసు పిల్లాడు బతికితే చాలు అని ఘోషిస్తోంది. రాక రాక ఆపద సమయంలో చెల్లెల్ని ఆదుకోవడం రామస్వామి కనీస ధర్మమైంది. అనసూయకి విషయం అర్థమైనా – పక్కనంటుకుపోయిన పసివాడ్ని చూస్తే గుండె తరుక్కుపోతోంది. ఈ రోజు అలివేలైంది రేపు తను కావచ్చు. అందోళన పడుతోంది అనసూయ.

" ఒక హెచ్చరిక :

గోదావరి నీటి మట్టం పెరుగుతూ ఆనకట్టపై ఈ రోజు సాయంత్రానికి 21.5 అడుగులు ఉంది. ఇంకా పెరిగే అవకాశం ఉంది. 1953 లో నమోదైన నీటి మట్టం కన్నా ఇది రెండున్నర అడుగులు ఎక్కువగా ఉంది. ఇరుపైపులా వరద నిరోధక బ్యాంకులు ఇంకా పటిష్టం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అయినా కొన్ని బలహీన ప్రదేశాలలో గండ్లు పడే అవకాశం ఉంది.

ఈ పెరిగిన నీటిమట్టం మరో ఇరవై నాలుగు గంటల వరకు ఉండే సూచనలు కలవు. కావున వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవలసిందిగా గోదావరి flood conservation తెలియజేస్తున్నారు"

వార్తా పత్రికల నిండా వరదల వార్తలే. రేడియో వార్తలలో ముఖ్యమంత్రిగారి సంతాపాలే. ప్రధానమంత్రిగారు వచ్చి పలకరించి ఓదార్చి ముఖ్యమంత్రిగారు కోరగా ముప్పైకోట్లు ప్రకటించి మరీ వెళ్ళారు. విజయవాడలో, గుడివాడలో ఎక్కడెక్కడి జనం వరద బాధితుల క్యాంపుల నిండా నిండారు.

ఎవరి నోట విన్నా ప్రభుత్వం మాకేమీ ఇవ్వటం లేదనేమాట. స్వచ్ఛంద సేవా సమితులు ఇతోధికంగా సాయం చేస్తున్నాయి.

రోజులు గడుస్తున్నాయి. ఊళ్లోకి వచ్చిన నీళ్ళు ఇంకిపోలేదు. వచ్చిన నీళ్ళు వచ్చినట్లు నిలిచిపోయాయి. రెఫ్యూజీ క్యాంపులలో జనం కిట కిట లాడుతున్నారు.

అనసూయ అహర్నిశలు ఆడబిడ్డనీ, పిల్లాడినీ కాపాడుకుంటోంది. రామస్వామి డబ్బు మంచినీళ్ళప్రాయంగా ఖర్చయిపోతోంది.

ఎవరికీ స్థిమితంగా ఆలోచించే సమయం లేదు.

*

ఎండలు ఫెళ్ళని కాశాయి. నీరు ఎండింది. జనం వారి వారి వూళ్ళకి లారీలలో తరలిపోయారు. వెళ్తూ వెళ్తూ సత్తు గిన్నెలు, దుప్పట్లు, చీరలు, ధోవతులు, పాండబ్బాలు మూటకట్టుకుని ప్రభుత్వం కట్టించబోయే ఇళ్ళల్లో కొత్త జీవితం మొదలు పెట్టడానికి వెళ్ళిపోయారు.

*

ఇరవై రోజులు మంచానికి అంటుకుపోయిన పిల్లాడు బతికి బట్ట కట్టాడు. ఆ రోజు రామస్వామి చెల్లెలికి రెండు నూలు చీరలు కొనిచ్చి సాగనంపాడు.

చెక్కబీరువా తీసి డబ్బు లెక్కపెట్టాడు రామస్వామి. తొమ్మిది పందల డెబ్భైనాలుగు రూపాయలు మిగిలాయి.

అతనికి విషాదం, ఒక రకమైన సంతృప్తి ముందు కార్యక్రమం ఎలా నిర్వహించాలో అనే సంశయం, మాట నిలుపుకోలేని బాధ, మనిషి నాదుకున్న తృప్తీ, ఎన్నో అనుభూతులు ఒకే క్షణంలో కలిగాయి.

*

వాసంతికి విషయమంతా వివరంగా చెప్పారు తల్లిదండ్రులు. ఆమె ముఖంలో పెద్దగా కన్విన్స్ అయిన ధోరణి కనిపించలేదు.

" ఏమో బాబూ ! మా ఆయనకేం చెప్పుకుంటారో నాకు తెలీదు. ఆయన మూడు నెలల నుంచీ, ఈ డబ్బు గురించి లెక్కలు వేసుకుంటున్నారు. "

" అదేమిటే ! నువ్వు పరిస్థితి వివరించి చెప్పు. త్వరలో సద్దేస్తాంలే " అంది అనసూయ.

" అమ్మో ! మా ఆయన చాలా మంచివారే. ఒక్క డబ్బు విషయం తప్పిస్తే - ! డబ్బు దగ్గర మహా నిక్కచ్చి. అంతెందుకు, ఆ డబ్బు మీరు సర్దుతేనే నేను మళ్ళీ వెళ్ళేది " అంది.

రామస్వామి పేపరులో తలదూర్చి తల్లీ కూతుళ్ళ సంభాషణ వింటున్నాడు.

డబ్బు తప్పిస్తే అంతా మంచివాళ్ళే - అందుకే అన్నాడు మార్క్స్ మహానుభావుడు. ఆర్థిక సంబంధాలు అన్ని అనుబంధాల్ని తుంచి పారేస్తాయి.

ఆ క్షణంలో కూతురు వాసంతి ఆర్థిక సంబంధమైన సంసారం కంటె, చెల్లెలు అలివేలు కూలిన జీవితమే ముఖ్యమనిపించిందతనికి,

*

వాసంతి విసుగ్గా వారపత్రిక విసిరికొట్టి అస్థిమితంగా పక్కమీద అటూ యిటూ పొర్లుతోంది. రామస్వామి మళ్ళీ అప్పుకోసం విశ్వ ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. అనసూయ జ్ఞాపకమొచ్చిన దేవుడికల్లా మొక్కుతోంది-

" అప్పు పుట్టించి, మా వాసంతిని అల్లుడి దగ్గరికి పంపే వరం ప్రసాదించు తండ్రీ " అని.

నెల్లాళ్ళ క్రితం పేపరు మళ్ళీ తిరగేస్తూ కూర్చున్న రామస్వామి " నదులన్నీ పొంగి సముద్రం వైపు పరుగులు పెడితే సముద్రం యిముడ్చుకోలేక ఎదురు తన్నేసింది. అందుకే ఊళ్లో వచ్చిన నీళ్ళు నిలిచిపోయాయి "

" నదులన్నిటికీ రత్నగర్భుడు సాగరుడు భర్త కదా ! ఆయనకి కూడా కట్నంలో బకాయి వుండీ పుట్టింటికి నదిని నెట్టేశాడన్నమాట " — రామస్వామి తన ఊహకి తనే నవ్వుకున్నాడు.